www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 ఏప్రిల్ 2023



'కృష్ణారెడ్డి శ్రీ చైతన్య'లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్థానిక హథీరాంజి కాలనీ బైరాగి పట్టెడలో ఉన్న కృష్ణారెడ్డి శ్రీ చైతన్య పాఠశాల నందు యూకేజీ నుండి ఐదవ తరగతి విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల సీఈవో అలేఖ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూకేజీ పిల్లల్ని ఇలా గ్రాడ్యుయేషన్ డే ద్వారా ప్రోత్సహించడం చాలా మంచి విషయం అన్నారు. అదేవిధంగా చదువు యొక్క ప్రాముఖ్యతను,కాలం యొక్క విలువలను తెలియజేశారు. అధ్యాపకులు పిల్లలతో వ్యవహరించే శైలి ఎంతో బాగుందని వారిని అభినం దిచారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

• ఒక్కో డాక్యుమెంట్‌పై రూ.700 భారం • క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

విద్యుత్, గ్యాస్, పెట్రోల్, ఆస్తిపన్నులతో పాటు నిత్యావసర వస్తువుల ధరలనూ నిత్యం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాదుతూనే ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం చడీచప్పుడు లేకుండా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లపై యూజర్ ఛార్జీలను పెంచి పెనుభారం మోపింది. తిరుపతి బాలాజీ జిల్లా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళతవారం నుంచి యూజర్ చార్జీలు అమలు చేస్తున్నారు. ఒక్కో డాక్యుమెంట్‌పై రూ 700నుంచి రూ 750వరకు భారం పడుతోంది. ఆయా ప్రాంతాల్లోని ఆస్తుల మార్కెట్ విలువలు తెలియజేస్తూ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ధృవీకరణపత్రాన్ని అందజేస్తుంది. దీనికి ఇప్పటి వరకు రూ 10 తీసుకుంటున్నారు. సవరించిన ధరల ప్రకారం రూ 50 చెల్లించాలి. ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చార్జీకింద ప్రస్తుతం రూ 100నుంచి 200వరకు వసూలు చేస్తున్నారు. దీన్ని రూ 500 చేశారు. రిజిస్ట్రేషన్ జరిగిన ఆస్తి తాలూక దస్తావేజు నకలుకు ఇప్పటివరకు రూ 20 చెల్లిస్తున్నారు. దీని ఖరీదు రూ 100 అయింది. 30ఏళ్లలోపు వివరాలు తెలుసుకునేందుకు(ఈసీ) తీసుకుంటే ఫీజు కింద రూ 200 అంతకంటే ఎక్కువ తీసుకుంటే రూ 500 తీసుకుంటున్నారు. దీనికి యూజర్ చార్జీ ప్రసుత్తం రూ10 ఉండగా ఇపుడు రూ 100 చేశారు. ఒక్కో పేజికి ప్రస్తుతం తీసుకునే రూ 5ను రూ 10 గా పెంచారు. కంప్యూటర్ ఎయిడెడ్ ఆడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (కార్డు) కింద అందించే సేవల్లో భాగంగా హార్డ్‌వేర్, నెట్ వర్కింగ్ ఎక్విప్‌మెంట్ ,పవర్‌బ్యాకప్, విద్యుత్ వినియోగ బిల్లు ,ఇతర అవసరాల ఖర్చులు పెరిగాయని పేర్కొంటు ఈపెంపు నిర్ణయం తీసుకుంది.

సేవల వారీగా పెరిగిన చార్జీలు

సర్వీస్ పేరు	ప్రస్తుత ధర (రూ.)	కొత్తధర (రూ.)
మార్కెట్ విలువ ఖరారు ధ్రువపత్రం	10	50
ఈసీ సర్టిఫికెట్ యూజర్‌చార్జీ	10	100
సర్టిఫైడ్ కాపీ	20	100
ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చార్జీ	200	500
ఒక్కోపేజికి	5	10
రూ 5వేలలోపు స్టాంపులు	10	50
రూ 5వేల కంటే ఎక్కువ స్టాంపులు	20	100
రూ 10వేలు నుంచి 99,999మద్యన	10	50
రూ లక్ష కంటే ఎక్కువగా	20	100
సర్టిఫైడ్ ఫర్మ్ రిజిస్ట్రేషన్	50	100
రిజిస్టర్ సోసైటి సర్టిఫైడ్ కాపీ	50	100

స్టాంపుల కొరత

అవసరాలకు తగ్గట్లు నాన్–జ్యూడిషియల్ స్టాంపులను కక్షిదారులకు అందుబాటులో ఉంచడంలో రిజిస్ట్రేషన్స్ స్టాంపుల శాఖ విఫలమైంది. రిజిస్ట్రేషన్ ,ఒప్పందాలు అఫిడవిట్, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఉపయోగించే ఈస్టాంపులు కొన్ని జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని కాని వెండర్ల వద్ద కానీ లభించడం లేదు. తిరుపతి లో కొంత మంది వెండర్లు కృతిమ కొరత సృష్టిస్తున్నారు. తిరపతి బాలాజీ జిల్లా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రూ 100స్టాంపులు మాత్రమే విక్రయిస్తున్నారు. మరికొన్నిచోట్ల రూ 10, 20, 50 స్టాంపులు దొరకడం లేదు. దీంతో కొందరు తప్పనిసరి స్థితుల్లో రూ 100స్టాంపుల కోసం డిమాండ్ లేని సబ్ రిజిస్ట్రేర్ కార్యాలయల నుంచి వీటిని తెప్పించుకుంటున్నారు. చిత్తూరు, మదనపల్లి వంటి చోట్ల కూడా స్టాంపుల కొరత ఎక్కువగా ఉంది

బడులు ప్రారంభించిన రోజే 'విద్యాకానుక'

ప్రజాశక్తి-తిరుపతి టౌన్/ తిరుపతి అర్బన్

రానున్న విద్యా సంవత్సరం జూన్ 12న ప్రభుత్వ బడుల్లో పూర్తి సౌకర్యాలు కల్పించి, జగనన్న విద్యాకానుక అందించి పండుగ వాతావరణంలో పున్ణప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాకానుక అందిన వెంటనే ప్రతి వస్తువు నాణ్యత పరిశీలించాలని, ప్రజాప్రతినిధులు పరిశీలించే విధంగా ఆడిట్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని, నాణ్యతా లోపం ఉంటే మార్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. గత ఏడాది పదో తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులు 637 మంది ఉన్నారని, వారిని తప్పనిసరిగా గుర్తించి టీచర్లకు సబ్జెక్టు బోధనకు అనుసంధానం చేయాలని, సమ్మతి చూపని వారిని ఖాళీగా ఉంచకుండా తప్పనిసరిగా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నచ్చిన రంగంలో సాంకేతిక శిక్షణ ఇప్పించాలన్నారు. పాఠశాలలు తెరవడానికి దాదాపు 40 రోజుల సమయం ఉందని, నాడు–నేడు పనులు పూర్తి చేయాలన్నారు. వాచ్‌మెన్ నియామకం పేరెంట్స్ కమిటీ సమావేశంలో పూర్తి కావాలన్నారు. ట్యాబ్‌ల వినియోగ సమయం పెరగాలని, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని, సాంకేతిక లోపం వస్తే వెంటనే సంబంధిత టీచర్ డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేయాలన్నారు. తిరుపతి కేంద్రంగా నాలుగు సర్వీసు సెంటర్లు ఉన్నాయని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, పంచాయతీరాజ్ ఇంజినీర్ శంకరనారాయణ, గ్రామీణ నీటి పారుదల ఇంజినీర్ విజయకుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి

శ్యాంమోహన్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా స్కూటర్ల పంపిణీ

జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల, వయోజనుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ ముంతాజ్ పఠాన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు చేతుల మీదుగా తిరుపతి జిల్లాకు మంజూరైన 65 పెట్రోల్ స్కూటర్లను విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా పంపిణీ చేశారు. వీటి విలువ ఒక్కొక్కటి లక్షా 20వేలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలోని 18–45 సంవత్సరాల లోపు అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు పీజీ చేసే వారికి, స్వయం ఉపాధి చేసుకునేవారికి ప్రాధాన్యత ఇచ్చి 65 మందికి రూ.75 లక్షల విలువైన పెట్రోల్ స్కూటర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ ఎవై శ్రీనివాస్, సూపరింటెండెంట్ వినోద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం పర్యవేక్షణ

పాకాల : చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పర్యవేక్షించారు. అనారోగ్యంతో సంభవించే అనర్థాలను అధిగమించాలంటే ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు తప్పనిసరన్నారు. వైద్యశిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన అక్కడి వసతులు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై చర్చించారు. పంచాయతీలో ఇప్పటికే మూడువేల మందికి పైగా ఆరోగ్య పరీక్షలు చేసుకున్నట్లు తెలిపారు.

టీటీడీ వెబ్‌సైట్లపై ఈస్ట్ పీఎస్‌లో జనసేన ఫిర్యాదు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

టిటిడి వెబ్‌సైట్లపై తిరుపతి ఈస్టు పోలీసు స్టేషన్‌లో జనసేన నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కిరణ్‌రాయల్ మాట్లాడుతూ టీటీడీ వెబ్‌సైట్‌లో దర్శనం, గదులు బుక్ చేసుకున్న భక్తులకు షాక్ తగులుతోందని, దర్శన టికెట్లకు తీసుకోవాల్సిన డబ్బులకంటే అధికంగా వసూలు చేస్తున్నారని, టీటీడీ జీఎస్టీ పరిధిలో ఉందా? జగన్ ట్యాక్స్ పరిధిలో ఉందా? అంటూ ఎద్దేవా చేశారు. ఇలాంటి దొంగ వెబ్సైట్లలోనే కాకుండా, అఫీషియల్ టీటీడీ వెబ్ సైట్లలో మొసాలు జరగటం ఏంటని వెంటనే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టి, కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇంత జరుగుతున్నా టీటీడీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని, భక్తుల నుండి అధిక వసూళ్లలో టీటీడీ పాలకమండలి హస్తమేమైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టే టీటీడీ ఈఓ ధర్మారెడ్డి దీనిపై ఏం సమాధానం చెబుతారో తెలియజేయాలని కోరారు. టీటీడీ కేసులు పెట్టడం, మంత్రులతో సిఫార్సులు చేయించుకోవడం మానుకుని భక్తులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, బాబ్జి, రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

సులభ్ కార్మికులకు అండగా పోరాట కమిటీ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

టీటీడీలో పనిచేస్తున్న సులభ్ కార్మికులకు అండగా సమస్య పరిష్కారం కోసం అన్ని పక్షాలతో పోరాట కమిటీ ఏర్పాటు చేస్తూ అఖిలపక్షం నిర్ణయం తీసుకుంది. ఏఐటియుసి తిరుపతి నగర సమితి ఆధ్వర్యంలో సులభ్ కార్మికుల సమస్య పరిష్కారం అన్న అంశంపై శనివారం బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, జనసేన పార్టీ నాయకులు కిరణ్ రాయల్ మాట్లాడుతూ టీటీడీలో పనిచేస్తున్న 3,500 మంది కాంట్రాక్ట్ కార్మికుల సమస్యను టిటిడి యాజమాన్యం వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున తిరుపతి పరిసర ప్రాంతాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. టీటీడీలో జరుగుతున్న అధర్మ పాలన. అవినీతి పలు అంశాలపై కరపత్రాల రూపంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని, దేశం నలుమూలల నుండి వస్తున్న యాత్రికులకు వివరిస్తామని తెలిపారు. ఇప్పటికైనా టీటీడీ ఈవో ధర్మారెడ్డి భేషజాలు పోకుండా సులభ్ కార్మికులను పిలిచి వారి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని, శ్రీ లక్ష్మీ శ్రీనివాస మేన్ పవర్ కార్పొరేషన్‌లో వీళ్ళందర్నీ సభ్యులుగా చేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, స్విమ్స్‌లో ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.
వీరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి. ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కుమార్ రెడ్డి, రాధాకష్ణ, టిడిపి అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్ర నాయుడు. సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథం. దళిత సంఘం నాయకులు లోకనాథం. ధనశేఖర్. పులి శ్రీకాంత్. చంద్రబాబు. చిత్తూరు శివశంకర్. అమర్నాథ్, వడ్డెర, ఎన్జీవో సంఘ నాయకులు సురేష్ మద్దతుగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, సర్దార్ శివ, శ్రీరాములు, శివ, రాజా. మణి. గోవిందస్వామి. ముద్దు కష్ణ ప్రమీల. కాలయ్య. మంజులమ్మ. ఉదయ్, చలపతి, రామకష్ణ పాల్గొన్నారు.

సులభ్ కార్మికులను పలకరించిన చెవిరెడ్డి

తమకు న్యాయం చేయాలని కోరుతూ టిటిడిలో పని చేస్తున్న సులభ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని టిటిడి ఎక్స్ అఫిషల్ సభ్యులు చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. నిరసన తెలుపుతున్న కార్మికులతో మాట్లాడుతూ ఇప్పటికే టిటిడిలో 14వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, వారికి టిటిడిలో ఇచ్చే అన్ని వెసులుబాటులను సులభ్ కార్మికులకు ఇచ్చే విధంగా టిటిడి ఉన్నతాధికారులతో మాట్లాడతానని కార్మికులకు హామీ ఇచ్చారు.

కార్మికులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్న చెవిరెడ్డి

టిటిడి హెల్త్ ఆఫీసర్ దూకుడుతో...

సులభ్ కార్మికులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తమను టిటిడి ఏర్పాటు చేసిన కార్పొరేషన్లో కలపాలని కోరుతూ సులభ్ కార్మికులు చేస్తున్న నిరసనలో శనివారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. హారేరామ హరేకృష్ణ మార్గంలోని టిటిడి మైదానంలో నిరసన తెలుపుతున్న కార్మికులను పరామర్శించేందుకు టిటిడి ఎక్స్అఫిషియో సభ్యులు, ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం రాత్రి రెండో దఫా కార్మికులతో చర్చించేందుకు టిటిడి మైదానానికి చేరుకున్నారు. టిటిడిలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు అందుతున్నాయో, వాటిని సులభ్ కార్మికులకు కూడా అందించేలా అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చి వెనుతిరిగారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న టిటిడి హెల్త్ ఆఫీసర్ శ్రీదేవి, ఎంఎల్ఏ వెళ్లగానే అక్కడ నుంచి జారుకునేందుకు ప్రయత్నించారు. పసిగట్టిన కార్మికులు తమకు న్యాయం చేయాలంటూ హెల్త్ ఆఫీసర్‌ను అడ్డుకున్నారు. వందలాది మంది ఒకసారి ఆమెను చుట్టుముట్టడంతో పోలీసులు వలయంగా మారి ఆమెకు రక్షణ కల్పించారు. హెల్త్ ఆఫీసర్ తన

కారులో మైదానం నుంచి వెళ్లేందుకు పూనుకోవడంతో కార్మికులు కారును అడ్డుకున్నారు. వందలాది మంది చుట్టుముట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సమన్వయం పాటించి, కార్మికులను పక్కకు తీసేందుకు పూనుకున్నారు. ఇంతలో హెల్త్ ఆఫీసర్ తన కారున ముందుకు పోనివ్వడంతో పలువురు మహిళలు కారుకు అడ్డంగా పడిపోయారు. అయినా కారు వేగంగా ముందుకు వెల్లడంతో సులభ కార్మికురాలు ధనలక్ష్మీ కుడికాలుపై కారు చక్రం ఎక్కడంతో గాయాలయ్యాయి. ఈమెతో పాటు ప్రసన్న అనే కార్మికురాలు కుడిచేయి విరిగింది. సెల్వి అనే కార్మికురాలికి కారు అద్దం తగిలి రక్తగాయాలయ్యాయి. వీరితో పాటు మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. కార్మికులు ఆర్తనాదాలు చేస్తుండగానే పోలీసులు సహాయంతో హెల్త్ ఆఫీసర్ అక్కడ నుంచి జారుకుంది. పోలీసులు కార్మికులకు సర్దిచెప్పారు. గాయపడిన వారిని జనసేన నాయకులు డాక్టరు పసుపులేటి హరిప్రసాద్ పరామర్శించి, తన ఆసుపత్రిలో వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు. అర్ధరాత్రి వరకు కార్మికులు అక్కడే బైఠాయించారు.

జేఈఈలో 'నారాయణ' ప్రభంజనం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో అత్యుత్తమ ప్రతిభతో ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు తెలిపారు. స్థానిక ఎంఆర్ పల్లి సమీపంలోని నారాయణ ఐఐటి క్యాంపస్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యార్థి సి.మిఖిల్ వందశాతం మార్కులతో ఆల్ ఇండియా 40వ ర్యాంకు సాధించారన్నారు. అతనితో పాటు వింద్య 138, బాబు సుజన్‌రెడ్డి 155, భువనచంద్ర 162, శశాంక్‌రెడ్డి 208, జస్విన్‌రెడ్డి 494, మనోజ్‌కుమార్ 741, కృతిబేతు 911, ప్రేమచంద్రారెడ్డి 1053 ఓపన్ క్యాటగిరి ర్యాంకులను సాధించారన్నారు. ర్యాంకులతో పాటు ఫిజిక్స్‌లో ఇద్దరు, మ్యాథ్స్‌లో ఇద్దరు, కెమిస్ట్రీలో ఒకరు వందశాతం మార్కులు సాధించారన్నారు. జాతీయస్థాయిలో వందలోపు ఒకరు, వెయ్యిలోపు 8 మంది, ఐదువేల లోపు 14 మంది, 10వేల లోపు 23 మంది ర్యాంకులు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ ర్యాంకులన్నీ ఓపెన్ కేటగిరిలో సాధించడం సంతోషకరమన్నారు. సుమారు 150 మంది తమ విద్యార్థులు వివిధ కేటగిరీలలో జాతీయస్థాయి సాంకేతిక విద్యాసంస్థల్లో సీటు సాధించే ర్యాంకులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. వారికి సహకరించిన అధ్యాపకులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్‌లు చక్రవర్తి, వేణుగోపాల్, ప్రిన్సిపాళ్లు సురేష్, రామయ్య, కుసుమ, అధ్యాపకులు విజయ్‌కుమార్, సందీప్, శ్రీనివాస్, చిట్టిబాబు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సిఎస్ఈ చేయాలన్నదే ధ్యేయం

మిఖిల్, జెఈఈ మెయిన్స్ 40వ ర్యాంకు

సిఎస్ఈ చేయాలన్నదే నా లక్ష్యం. అందుకోసం కష్టపడి చదివాను. ఎన్‌సిఆర్‌టిని పాలో అయ్యాను. క్లాస్‌రూమ్‌లో చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నాను. రోజుకు 7 గంటలు తప్పనిసరిగా నిద్రకు కేటాయించాను. అధ్యాపకులు, కాలేజీ యాజమాన్యం ఇచ్చిన సూచనల మేరకు, తల్లిదండ్రులు సి.ధనంజయరెడ్డి, ఇందిరాల ప్రోత్సాహంతో కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివాను. నేడు జాతీయస్థాయిలో ఓపెన్ క్యాటగిరిలో 40వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. మద్రాసు, బాంబే ఐఐటిలో సీటు తీసుకుని సిఎస్ఈ పూర్తి చేసి, దేశానికి ఉపయోగపడేందుకు కృషి చేస్తాను.

సిఎస్ఈ చేయాలన్నది నా కల

పి.వింధ్య, జెఈఈ మెయిన్స్ 138వ ర్యాంకు

మా తల్లిదండ్రులు జనార్ధన్‌రెడ్డి, హేమలతల చొరవతో చిన్నతనం నుంచి ఐఐటి చేయాలని నిర్ణయించుకున్నాను. హైస్కూల్ చదివేటప్పుడు తప్పనిసరిగా సిఎస్ఈ చేయాలని భావించాను. అందుకు నారాయణ కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం నాకు బాగా సహకరించారు. చదువుపై ఆసక్తి పెంచి, సులభమైన రీతిలో ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేసేందుకు తర్ఫీదు ఇచ్చారు. వారు చెప్పిన దాన్ని తూ.చ తప్పకుండా పాటిస్తూ, ఇంటి వద్ద చదువు కోసం మూడు గంటలు అదనంగా కేటాయించడంతో ఇపుడు జాతీయ స్థాయిలో 138వ ర్యాంకు సాధించాను.

ఎస్ఆర్ అకాడమి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎన్‌టిఏ విడుదల చేసిన జెఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో ఎస్ఆర్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఆ కళాశాల జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ తెలిపారు. స్థానిక తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురం వద్దనున్న ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యార్థి కె.దినేష్ ఆల్ ఇండియా జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో 95.7292005 శాతం మార్కులతో జాతీయ స్థాయిలో 1649వ ర్యాంకు సాధించారన్నారు. విజయం సాధించిన విద్యార్థిని అభినందించారు.

అమరావతి అకాడమీ ప్రతిభ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ





ఎన్ టి ఎ శనివారం విడుదల చేసిన జెఈఈ మెయిన్స్ 2023 ఫలితాలలో తిరుపతిలోని అమరావతి ఐఐటి అకాడమీ (కృష్ణారెడ్డి శ్రీ చైతన్య అకాడమి) లో సి. కులదీప్ రెడ్డి 99.42 శాతం, రంగ చేతన్ రామ్ తిలక్ 99.31 శాతం, పి. వర్షితారెడ్డి 98.94 శాతం, వై. భరద్వాజ్ 98.88 శాతం, టి. బాలాజి 98.61 శాతం, ఎ. హరికష్ణ 98.48 శాతం, పి. యుగంధర్ రెడ్డి 98.44 శాతం, యం. వెంకటలక్ష్మీ 98.12 శాతం, వి. వష్టి 98.08 శాతం సాధించారు. మంచి మార్కులు సాధించిన విజేతలైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల్లో మహాత్మాగాంధీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బైరాగి పట్టెడ లోని మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు తమిళనాడు రాష్ట్రంలోని రామనాథపురం లో జరిగిన సౌత్ జోన్ హాకీ క్రీడా పోటీల్లో రజిత పథకం సాధించారు. బి గౌరీ, కే భానుప్రియ, డి శ్రీజ, సబ్ జూనియర్ జూడో రాష్ట్రస్థాయి పోటీలు ఫిబ్రవరిలో జరిగాయి. కే.భవ్య బంగారు పతకం సాధించి అదే నెలలో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి జూడో పోటీలో పాల్గొన్నారు. జనవరి నెలలో జరిగిన స్కూల్ గేమ్స్ హాకీ జూనియర్ రాష్ట్రస్థాయి హాకీ, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి హాకీలో పాల్గొన్న ఎంజీఎం మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు బి మోనిషా, పి పూర్ణిమ, ఎం ఝాన్సీ ,పి తనుజ, కే వైష్ణవి, ఎం శిరీష, ఏ ముత్యాలమ్మ, కె. వేద సాయి నిలిచారు. స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో రాష్ట్రస్థాయిలో పాల్గొన్న విద్యార్థులు పి తనూజ కాంస్య పథకం సాధించింది. డిసెంబర్లో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పి.షాలిని విజయవాడలో పాల్గొన్నారు.విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.మురుగన్, 15వ వార్డ్ కార్పొరేటర్ తూకివాకాం శాలిని మహేష్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం ప్రసన్నలక్ష్మి అభినందించారు.

క్రీడల్లో ప్రతిభచూపిన విద్యార్థులు

జాతరకు 'విఐపి' పాసులు రద్దు

తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం కమిటీ వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

చరిత్ర కలిగిన తాతయ్యగుంట గంగమ్మ జాతర మే 9 నుండి 16వ తేదీ వరకు నిర్వహించనున్నామని, ఈ జాతర బ్రహ్మోత్సవాలలో వీఐపీ పాసులను రద్దు చేస్తున్నామని పాలకమండలి చైర్మన్ కట్టా గోపి యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో మీడియా ముందు ఆ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు , హరినాధ రెడ్డి , రమణమ్మ , ధన శేఖర్ , కష్ణమ్మ , గీత , భారతి తదితరులతో కలిసి గోపి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉన్న విఐపి పాసుల్ని రద్దు చేస్తే గాని , సామాన్య ప్రజలకు అమ్మవారి దర్శనం సులభతరం అవుతుందనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మే ఒకటి నుండి 5వ తేదీ వరకు మహా కుంభాభిషేక మహోత్సవం జరుపుతున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పర్యవేక్షణలో , జగద్గురువు కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ విజయేంద్ర సరస్వతి స్వాముల ఆశీస్సులతో , అమ్మవారి ఆలయ పునర్ ప్రారంభ కార్యక్రమం జరుగుతుందన్నారు. నగర ప్రజలు , చుట్టుపక్కల గ్రామ వాసులు తరలివచ్చి అమ్మవారికి మొక్కుకున్న మొక్కులను తీర్చుకోవాలని కోరారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి-తిరుపతి సిటి అమాయక ప్రజలను ఎరగా చేసుకుని సొమ్ము చేసుకోవాలని చూస్తే సహించేది లేదని, క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి పరమేశ్వరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐపిఎల్ టీ20 క్రికెట్ మ్యాచ్‌లను ఆసరాగా తీసుకుని, అమాయక ప్రజలను, యువకులను టార్గెట్‌గా ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చని ఆశల రేకెత్తిస్తూ, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తే ఊరుకునేది లేదన్నారు. జూదం చట్టప్రకారం వీరిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. యువత వీరి మాయల్లో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఊరికే వచ్చే డబ్బు అనేక కష్టాలను తెచ్చుపెడుతుందని తెలపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించాలని చూస్తే ఎంతటి వారినై వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షలో ఘన విజయం సాధించినట్లు శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ శరవణ తెలిపారు. 405 మంది విద్యార్థులు విజయం సాధించినట్లు పేర్కొన్నారు. శనివారం విద్యార్థుల అభినందన సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావడం ఆనందదాయకమని.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికిరణ్, గాయత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీకాలతో ప్రమాదకర వ్యాధులు దూరం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పోలియో వంటి మహమ్మారిని టీకాలఓ తరిమికొట్టాలని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో టీకా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ కోవిడ్, మశూచి, ధనుర్వాతం, పోలియో వంటి అత్యంత ప్రమాదకర వ్యాధులను మానవజాతి ఎదుర్కొనడంలో టీకాలు సమర్ధవంతమైన పాత్రను పోషించాయని తెలిపారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగ ఇన్‌ఛార్జి డాక్టర్ శాంసన్ రాజు, డాక్టర్ స్వాతి, డాక్టర్ వెంకట కష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

'జగన్‌నే మళ్లీ సీఎంగా చేద్దాం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైసిపి స్టేట్ ఎస్సీసెల్ కార్యదర్శి మల్లారపు మధు పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా నవరత్నాల పథకాలను తీసుకొచ్చి అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారిని లబ్ధిదారులుగా చేర్చి రాష్ట్ర ప్రజల ఆర్థిక పురోగతికి సీఎం జగన్ పాటుపడ్డారని కొనియాడారు. ముఖ్యంగా దళితులు వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలకు వెన్నుదన్నుగా ఉంటూ ఆర్థిక భరోసాను కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దళితులను చులకన భావనతో చూస్తూ వారి ఆర్థిక పురోగతికి ఎటువంటి ప్రణాళికలు, కేటాయింపులు చేయలేదని విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు దేవదానం, వెంకటస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేశ్విన్‌లో ఎలక్ట్రికల్ కారు ప్రారంభం

ప్రజాశక్తి-తిరుచానూరు: చెన్నై బైపాస్ రోడ్డులోని తూకివాకంలో కేశ్విన్ షోరూమ్‌లో ఎంజీ కామెంట్ ఎలక్ట్రికల్ కారును రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశ్విన్ షోరూం అధినేత ఆర్.ఉదయకుమార్ మాట్లాడుతూ మధ్యతరగతి వారికియ అందుబాటులో ఈ కారు రూపకల్పన జరిగిందన్నారు. నాలుగు సీట్లు, రెండు డోర్లతో కారు తయారీ జరిగిందన్నారు. ఇందులో ఎయిర్‌బ్యాగ్ తో పాటు రూ. 7.98 లక్షలతో అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో సీఈవో వెంకటరమణ, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-పాకాల: మండలంలోని చిన్నగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం రావూరి కోదండయ్యనాయుడు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలలో మొదటిగ్రేడ్ పొందిన హేమంత్ కు రూ.1500, రెండవ గ్రేడ్ పొందిన బి కిరణ్‌కు రూ.1000 అందించారు. చెన్నగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మొదటిగ్రేడ్ మోక్షితకు రూ.1500, రెండవ గ్రేడ్ పొందిన అలేఖ్యకు రూ.1000, మూడవ గ్రేడ్ పొందిన ప్రశాంత్ కు రూ.750 పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, జయబాల తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రోటరీ గూడూరు వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు మధుసూదనరెడ్డి కుమార్తె ఇషిక జన్మదినం సందర్భంగా నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్‌తో తరచూ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందనీ యమన్నారు. యువత సేవా దక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్షులు ధనుంజయ రెడ్డి, సీనియర్ ఆడిటర్ శ్రీ కంటి రామ్మోహన్ రావు , కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్ లో ఘనంగా కాన్ ఫ్లూయన్స్-2023

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంగ్లభాషపై పట్టు సాధించి నేడున్న పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విద్యార్థులకు ప్రత్యేకంగా కాన్ ఫ్లూయన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమరాల్డ్స్ కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్ తెలిపారు. కాన్ ఫ్లూయన్స్ 2023 కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని బీ.కాం, బీ.ఎస్సీ, బీబీఏ కోర్సుల విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి టాక్ ది టాక్, లిజన్‌అప్, ఫిక్షన్ డిక్షన్, ఇంక్ క్రాఫ్ట్ వంటి పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీలలో టాక్ ది టాక్ లో చందు, సంజుదేవి, ఫిక్షన్ డిక్షన్ లో సంజుదేవి, సింధు, లిజన్ అప్ లో శోభ పియుష్ జైన్, ఇంక్ క్రాఫ్ట్ లో భవ్యశ్రీ, గౌస్ భాషా విజేతలుగా నిలిచారన్నారు. స్పార్క్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సంజుదేవి కైవసం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, జానకిరామ్, పార్థసారథి, శ్రీనివాసులు, నాథముని, జాఫర్ వల్లి, అధ్యాపకురాలు గ్రేస్ వినీల, అమ్మాజీ, అంకిత, వసుంధర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో అక్రమం..!

- పట్టపగలే విచ్చలవిడిగా ఇసుక రవాణా ● పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు

ప్రజాశక్తి-నాయుడుపేట: పేదలు ఇల్లు కట్టుకోవడానికి బండె ఇసుక కావాలంటేనే పెద్ద సమస్యగా మారుతోంది. అలాంటిది పట్టపగలే దర్జాగా స్వర్ణముఖి నది నుంచి దౌర్జన్యంగా అనుమతులను ఉల్లంఘించి ఇసుక తరలిపోతున్నా.. రెవెన్యూ, పోలీసులు, సెబ్, మున్సిపాలిటీ అధికారులు చోద్యం చూస్తున్నారు. నాయుడుపేట స్వర్ణముఖి నదిలో ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నా అడ్డుకొనే నాథుడే కనిపించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక కావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన రీచ్ నుంచే.. ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి తరలించాలి. నాయుడుపేటలో స్వర్ణముఖి నుంచి అయితే నిర్మాణాల కోసం ఎవరైనా ఎద్దుల బండ్లలో మాత్రమే ఇసుకను తీసుకోవాల్సి ఉంది. అయితే స్వర్ణముఖి నదిలో ఇసుకను ఎవరూ అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలించకూడదని మునిసిపాలిటీ వారి ఆధ్వర్యంలో ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున మూడు నుంచి ఎనిమిది గంటల వరకు గేట్లు తెరుస్తారు. ఆ సమయంలో మాత్రమే ఎడ్ల బండ్లతో ఇసుక తీసుకెళ్లాలి. అయితే అవేమీ పట్టించుకోకుండా కొంతమంది ఇష్టానుసారంగా పట్టపగలే స్వర్ణముఖి నది నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. అయితే అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో ప్రజలు పలు ఆరోపణలు చేస్తున్నారు. ఎప్పుడూ అక్కడే ఉంటూ స్వర్ణముఖి చుట్టుపక్కల పనిచేస్తున్న మునిసిపల్ సిబ్బందికి, అధికారులకు తెలియకుండానే ఇసుక అక్రమ రవాణా జరుగుతోందా? అంతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వానికి ప్రజామద్దతు చారిత్రాత్మకం

ప్రజాశక్తి-సత్యవేడు: 'మా నమ్మకం నువ్వే జగన్' మెగా సర్వేలో 1.45 కోట్ల కుటుంబాలు పాల్గొని, 1.1 కోట్లకు పైగా మిస్డ్ కాల్స్‌తో రాష్ట్ర ప్రజలు సీఎం జగనన్న ప్రభుత్వానికి చూపిన మద్దతు ఒక చారిత్రాత్మకమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం బేరిశెట్టి కళ్యాణ మండపంలో జగనన్నే మా భవిష్యత్తు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 28వ తేదీ వరకు వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు పేరుతో మెగా పీపుల్స్ సర్వే నిర్వహించామన్నారు. ఇందులో భాగంగానే 7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల కోసం, వారి పిల్లల భవిష్యత్తు కోసం ఎవరిని విశ్వసిస్తున్నారనే అంశంపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారని వివరించారు. క్షేత్రస్థాయిలో వైసీపీ క్యాడర్ నిబద్ధత, పట్టుదలతో పనిచేసి ఈ సర్వేని పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ అద్భుతమైన ఫలితాలతో దేశంలోని ఏ రాజకీయ పార్టీ చేపట్టలేని.. అతిపెద్ద పబ్లిక్ సర్వేగా జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే నిలిచిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎటు చూసినా మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం మారుమోగుతోందన్నారు. తమ ప్రభుత్వం అవినీతి రహిత మధ్యవర్తులు లేని సంక్షేమ అభివద్ధి ప్రభుత్వమని, సీఎం జగన్ తెచ్చిన సంస్కరణల ఫలితమే అని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివద్ధి, ప్రజల సంక్షేమానికి వైసీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుశీల్ కుమార్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వైసీపీ మండల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిర్వహించిన మెగా పీపుల్ సర్వేలో 75 శాతం ప్రజలు సీఎం జగన్మోహన్ రెడ్డి కి మద్దతు తెలియజేశారని.. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్ కోరారు. గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు నివాసంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో వందశాతం మంది ప్రజలు సీఎం జగన్మోహన్‌రెడ్డికి మద్దతు తెలియజేశారని తెలిపారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యారం మంజుల , బొమ్మిడి శ్రీనివాసులు, రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, మోబిన్, అజీజ్, మన్యం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా బలంతో యువగళం విజయవంతం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రజల మద్దతు, ఉత్సాహంగా పాల్గొంటున్న యువత సహకారం, వైసీపీ పాలనలో కష్టాల బారిన పడ్డ ప్రజానీకం అండతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా ముందుకు సాగుతోందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్రలో లోకేష్‌తో కలిసి నడిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో వైసీపీ పాలనలో పడుతున్న కష్టాలు, ఇబ్బందులు తెలియజేస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం వస్తేనే తమ కష్టాలు తీరుతాయని ప్రజలు పాదయాత్రలో కలిసి నడుస్తున్నారు.

గిరిజనులు హక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ఏకొల్లు గ్రామంలోని గిరిజన కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు గోపీనాథ్‌రెడ్డి, ఎస్సై తిరుమలరావు పాల్గొన్నారు . గిరిజనులకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. వారి సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్ఐ స్వర్ణలత ,సెక్రెటరీ రామయ్య, సర్పంచి ఆవుల బ్లెస్సీ, ఎంపీటీసీ దొరస్వామి, వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌తో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): హోటల్ మేనేజ్మెంట్ కోర్సులను అభ్యసించిన వారు స్వదేశం లోనే కాక విదేశాల్లోనూ మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందు తున్నారని బ్లూమ్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ డైరెక్టర్ గిరిబాబు తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హోటల్ మేనేజ్మెంట్ చేసిన అనంతరం టూరిజం అనుబంధ సంస్థలతో పాటుగా ఎయిర్లైన్స్, రైల్వేస్, క్రూజ్ షిప్పింగ్ ఇండస్ట్రీస్‌లో మంచి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చన్నారు. హైదరాబాద్ కేంద్రంగా నడపబడుతున్న బ్లూమ్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ 1994లో స్థాపించారని, ఇప్పటివరకు వేలాదిమంది విద్యార్థులు దేశ విదేశాలలో మంచి హోదాల్లో రాణిస్తున్నారన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను టెన్త్ , ఇంటర్ పాస్ అయిన వారు తమ హోటల్ మేనేజ్మెంట్లో మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు 7337228820, 9966742488 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వచ్చేనెల 13న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర సూచించారు. శనివారం పుత్తూరు కోర్టు ఆవరణలో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను అధిక సంఖ్యలో రాజీ చేయాలన్నారు. క్రిమినల్ కేసులతో ముడిపడిన సివిల్ కేసులను రాజీ చేయడానికి కృషి చేయాలని సూచించారు. విలువైన కోర్టు సమయంతో పాటు కక్షదారుల సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు న్యాయవాదులు పురుషోత్తం, మురుగేషన్ రెడ్డి, శేషాచలం, సీఐ లక్ష్మీనారాయణ, కార్వేటినగరం సీఐ చంద్రశేఖర్, పుత్తూరు కోర్టు పరిధిలోని ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యా సంస్థల సమస్యలపై యూజీసీ కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి-క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల పలు రకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి ఆచార్య వైవి రామిరెడ్డి యూజీసీ కార్యదర్శి నూతన కార్యదర్శిగా నియమితులైన ఆచార్య మనీష్ జోషిని పుష్పగుచ్చంతో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విషయ విద్యాలయాలలో అధ్యాపకుల పలు రకాల సమస్యలపై ఆయనతో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన యుజిసి కార్యదర్శి ఆచార్య జోషి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్నటువంటి అధ్యాపక పోస్టులను రాబోయే నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను కూడా భర్తీచేసినందుకు చర్యలు చేపట్టాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉన్నత విద్యా సంస్థల్లో నూతన జాతీయ విద్య విధానాన్ని తప్పకుండా ప్రవేశపెట్టి అమలు చేయాలని తద్వారా విద్యార్థులకు అతి తక్కువ వయసులోనే పరిశోధనలు సాగించే అవకాశాలు ఉంటాయన్నారు. డిగ్రీ అభ్యసించే విద్యార్థులు మొదటి సంవత్సరంలో సర్టిఫికెట్ కోర్సుగా, రెండవ సంవత్సరాని డిప్లమా కోర్సుగా, మూడవ సంవత్సరాన్ని సాధారణ డిగ్రీగా, నాలుగో సంవత్సరాన్ని హానర్స్ డిగ్రీగా యుజిసి పరిగణిస్తుందన్నారు. నాలుగు సంవత్సరాల హానర్స్ డిగ్రీ చేసిన విద్యార్థులు నేరుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవకుండానే పరిశోధనల కోసం పీహెచ్డీ కోర్సులో చేరవచ్చని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఉన్నత విద్యాసంస్థల్లో సమస్యలను పరిశీలించుటకు ప్రత్యేక కమిటీ వేసి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

సంక్షేమ పథకాలే వైసీపీ ప్రభుత్వానికి రక్ష

ప్రజాశక్తి- దొరవారిసత్రం: ప్రభుత్వ సంక్షేమ పథకాలే వైసీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని.. ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం శ్రీ ధనమల్లి గ్రామంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పేదల అభివద్ధి కోసం అమలు చేసిన అభివృద్ధి పథకాలను తెలియజేస్తూ ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దువ్వూరు బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులను చూసి జగనన్నను, కిలివేటి సంజీవయ్యను ఆదరించి ఈసారీ ముఖ్యమంత్రి జగనన్నను, సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నాయకులు బాబురెడ్డి, అధికారులు తహశీల్దారు గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో సింగయ్య, జడ్పిటిసి సభ్యులు రమేష్, సీఐ సింగయ్య, ఎస్సై తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్మకొత్తూరు, పెనుబాక గ్రామాల్లో...



శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని కమ్మకొత్తూరు, పెనుబాక గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా శ్రీకాళహస్తి నియోజకవర్గం పాలించిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేక పోయారని..తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగు సంవత్సరాలలో ప్రతి గ్రామానికి సిమెంట్ రోడ్లు, తాగునీరు, మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని తెలిపారు. కులం, మతం చూడకుండా ప్రతిఒక్కరికీ అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో కమ్మకొత్తూరు సర్పంచ్ టి. రజిని, రమేష్ ఎంపీడీవో ప్రేమ్ రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ సురేంద్రనాథ్, శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని తిరుమలరెడ్డినగర్‌లోని శ్రీ నిలయం అపార్ట్మెంట్ ప్లాట్ నెంబరు 202లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాధిత ప్లాట్ యజమాని అరుణ తెలిపిన వివరాల మేరకు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో రెండు గదుల్లోని ఫర్నీచర్, విద్యుత్ ఉపకరణాలు పూర్తిగా కాలి దగ్ధమయ్యాయని తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.7 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష పరిశీలించారు. జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సమీపంలో ఉన్న హుస్సేనమ్మ దర్గా వద్ద ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఏకోళ్ల గ్రామానికి చెందిన మహేష్, నెల్లూరుపల్లి గ్రామానికి చెందిన సిద్ధార్థ గాయపడ్డారు. రెండు బైకులు ఎదురెదురుగా రావడంతో అదుపుతప్పి బైకులు ఢీకొన్నాయి. గాయపడిన వారిని 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. సిద్ధార్థ తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని మెరుగైన వైద్యం కోసి తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సభ విజయవంతానికి అందరి సహకారం

ప్రజాశక్తి-ఓజిలి: మే నాలుగో తేదీన జరగనున్న చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేయా లని సూళ్లూరు పేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ ఛైర్మన్ చంచల బాబుయాదవ్ , తిరుపతి పార్లమెంటు రైతు విభాగం అధ్యక్షులు రాధాకృష్ణమనాయుడు, నెల్లూరు మాజీ మున్సిపల్ ఛైర్మన్ టి.అనురాధ, నాగార్జునరెడ్డి, కందుల కృష్ణారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 4వ తేదీన నాయుడుపేటలో జరుగునున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి మాజీ మంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్నారన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌నాయుడు, శ్రీనివాసురెడ్డి, పాదర్తి ప్రకాష్ నాయుడు, కంకణాల వరప్రసాద్‌నాయుడు, నిరంజన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో జరిగే మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ పేర్కొన్నారు. పట్టణంలోని అంగన్వాడి వర్కర్స్ యూనియన్ సమావేశం ముని కుమార్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, సిఐటియు జిల్లా కోశాధికారి ప్రసాదరావు , సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే ఒకటే తేదీన 138 వ మే డే ను కార్మిక, కర్షక, ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ముని కుమారి, విజయ్ కుమారి, రాధా, పద్మజ, లలిత, అరుణ, కృష్ణవేణి , హైమావతి తదితరులు పాల్గొన్నారు.

వజ్రమ్మకు బీఎస్‌పీ సంఘీభావం

ప్రజాశక్తి-ఓజిలి: తనను విధుల్లోకి తీసుకోవాలని గత ఐదు రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికురాలు మైలారి వజ్రమ్మ మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తోంది. వజ్రమ్మకు బహుజన సమాజ్ పార్టి తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బందిల మోహన్ సంఘీభావం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న వజ్రమ్మను మండల విద్యాశాఖ అధికారి అకారణంగా తొలగించి వారంలో మళ్లీ విధులకు తీసుకుంటామని నమ్మబలికి ఆమె వద్ద తెల్ల కాగితంపై సంతకాలు చేయించుకుని తొలగించారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం పథకం జిల్లా కార్యదర్శి కె.విజయమ్మ, ఐద్వా మహిళా కన్వీనర్ చేజర్ల.చంద్రకళ , సూళ్ళూరుపేట అసెంబ్లి బహుజన సమాజ్ పార్టి ప్రధానకార్యదర్శి పామంజి ధనంజయ, నాయుడుపేట టౌన్ ప్రధాన కార్యదర్శి కలికిరి సుబ్రమణ్యం, మధ్యాహ్న భోజన కార్మికులు జయమ్మ, విమలమ్మ, అనిత, మంగమ్మ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం ఏకగ్రీవం

ప్రజాశక్తి - బాలాయపల్లి : మన్నూరు కల్లు గీత కార్మిక సంఘం ఏకగ్రీవం అయినట్లు వెంకటగిరి ఎక్సైజ్ సీఐ సురేంద్ర అన్నారు.శనివారం మండలంలోని మన్నూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కల్లుగీత కార్మిక సహకార సంఘం నియమకం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కల్లుగీత కార్మిక సహకార సంఘం అధ్యక్షుడిగా వెఃపులూరు.జగన్నాథం, ఉపాధ్య క్షులుగా జూపల్లి.పెంచలయ్య,డైరెక్టర్లుగా పర్చూరు. మురళీ, ఎం. రామయ్య, పి. వెంకటేశ్వర్లు లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది ఆంజనేయులు,సురేష్, వెంకటగిరి నియోజకవర్గం గౌడ సంఘం అధ్యక్షులు జడపల్లి కోటేశ్వరరావుపాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని నిండలి గ్రామంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది ఈ గ్రామంలో సీతారాముల కళ్యాణం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు నాలుగు రోజులు ముందు సీతారాముల కళ్యాణం కార్యక్రమం చేయడం ఈ గ్రామంలో ఆనవాయితీ. అయితే ఈ గ్రామంలో నుంచి దూర ప్రాంతంలో ఉన్న వారంతా కార్యక్రమానికి గ్రామంలో చేరుకొని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. పూజలు ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.